www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024
5
చిత్తూరు

జగన్ వచ్చాక 'పట్టు' తప్పింది.!

● పలమనేరులో పట్టు రైతులు, రీలర్ల సమ్మె

● పెండింగ్ ఇన్సెంటివ్ చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-పలమనేరు: పట్టు రైతులు, రీలర్లకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ చెల్లించాలని రైతు సంఘం నాయకులు గురుమూర్తిశెట్టి డిమాండ్ చేశారు. బుధవారం పలమనేరు పట్టణంలో గల సిల్క్ ఫార్ వద్ద పట్టు రైతులు, రీలర్లు ఇన్సెంటివ్ కోసం నిరవేదిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా పట్టు రైతులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి మల్బరి సాగు చేస్తున్నమని, సక్రమమైన గిట్టు పాటు ధర లేక నష్టపోతున్నామన్నారు. గత ప్రభుత్వాలు గుర్తించి ఒక్క కేజీ పట్టుగూళ్ళకు 50 రూపాయలు చొప్పున ఇన్సెంటివ్ ప్రకటించారని, అప్పట్లో ఇన్సెంటివ్ అందుతున్నప్పటికీ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఒక్క పైసా కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలు నాటడానికి ప్రోత్సాహక నగదు, పరికరాలకు, పట్టుపురుగులకు వాడే మందులపై, యంత్రాలు తదితర పరికరాలపై రాయితీలు ఇచ్చే వారిని ప్రస్తుతం అవి ఏ మాత్రం పట్టు రైతులకు అందలేదని, ఈ విషయాన్ని నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయి, నాయకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న కనికరము లేక పట్టు రైతులను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందిస్తూ గతంలో పట్టు రైతులకు ఇస్తున్న, పెండింగ్ ఇన్సెంటివ్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, చంద్రప్ప గౌడు, రిజ్వాన్, అమానుల్లా, ఆనంద రెడ్డి, మునిరత్నం రెడ్డి, కరుణాకర్ శెట్టి, గోవిందు, మౌలా పట్టు రైతులు, రీలర్లు పాల్గొన్నారు.

మాటిచ్చారు.. నెరవేర్చరే..!

బైరెడ్డిపల్లిలో

● 37వ రోజూ అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-పలమనేరు: ఎన్నికల ముందు హామీ ఇచ్చారు.. న్యాయపరమైన డిమాండ్‌లు నెరవేర్చమంటే బెదిరిస్తారా.. అంటూ ప్రభుత్వంపై అంగన్వాడీలు ధ్వజమెత్తారు. తమ వేతనాలు, వివిధ డిమాండ్‌లు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారంతో 37వ రోజుకు చేరుకుంది. బుధవారం పలమనేరులో అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై నినాదాలతో హోరెత్తించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధర గుప్తా, ఓబుల్ రాజు కార్యదర్శి సిఐటియు భారతి, ఐఎఫ్టియు ఇర్షాద్, రాధ ఏఐటీయూసీ శాంతి, గోవిందమ్మ, అనసూయ, ధనమ్మ , గోవిందమ్మ, లత, అబీదా తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో

నోటీసులకు సమాధానం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: సమ్మెలో పాల్గొంటున్న అంగన్వాడీలకు ఐసీడీఎస్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. అందుకు ప్రతి స్పందనగా అంగన్వాడీలు బుధవారం బైరెడ్డిపల్లి మండలం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లతకు వివరణ ఇచ్చారు.

నోటీసులకు సమాధానం ఇస్తే బెదిరింపులా..?

● అధికారులపై చర్యలు తీసుకోవాలన్న వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అన్ని రకాలుగా బెదిరింపులకు పాల్పడి ఎస్మా చట్టాన్ని ప్రయోగించి షోకాజ్ నోటీసులు ఇచ్చిందని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. నోటీసులకు పది రోజులు లోపు సమాధానాలు ఇవ్వాల్సి ఉండగా అంతలోపే అంగన్వాడీలు సమాధానం ఇస్తుంటే చిత్తూరు జిల్లాలో ఐసిడిఎస్ అధికారులు సమాధానాన్ని తిరస్కరిస్తూ సమ్మె విరమిస్తున్నట్లు రాసిస్తేనే తీసుకుంటామని బెదిరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిత్తూరు జిల్లాలో ఐసిడిఎస్ అధికారుల తీరు బాధాకరమని ప్రభుత్వ అధికారిగా ఉంటూ ఎవరు ఏది ఇచ్చినా తీసుకోవాలి, షోకాస్ నోటీస్కు సమాధానం ఇస్తుంటే తీసుకోకుండా బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఏదైనా ఇవ్వదలు చుకుంటే పిడికి ఇచ్చుకోండంటూ నిర్లక్ష్య ంగా సమాధనం చెబుతున్నట్లు మండిపడ్డారు. నోటీస్ ఇచ్చిన సీడీపీవోకి సమాధానం ఇవ్వాల్సి ఉండగా జిల్లా అధికారికి ఎందుకు ఇస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిడిపిఓలు చట్ట విరుద్ధంగా వ్యవహరించడంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఏదైనా నష్టం జరిగితే సీడీపీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం: జెసి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జేసి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని జేసి ఛాంబర్ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి డిఆర్ఓ రాజశేఖర్‌తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు చిత్తూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమ పూర్తి పర్యవేక్షణ ఆర్డిఓ చిత్తూరు పర్యవేక్షించాలని, గ్రౌండ్‌లో బందోబస్తు, జెండా వందనం, స్టేజ్ డెకరేషన్‌ను, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, సీటింగ్ ఏర్పాట్లను చిత్తూరు తహశీల్దార్, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ ఏర్పాటును డిఈఓ, అసెట్స్ డిస్ట్రిబ్యూషన్, స్టాల్స్ ఏర్పాట్లను డిఆర్డిఏ పిడి, ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లను డిఎంఅండ్‌హెచ్ఓ, పారిశుద్ధ్యం, త్రాగునీరు, వసతి ఏర్పాట్లను చిత్తూరు మున్సిపల్ కమిషనర్, స్టాల్స్ నందు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శనలో భాగంగా డిఆర్డిఏ, హౌసింగ్, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, విభిన్న ప్రతిభావంతులు, ఐసిడిఎస్ సంబంధిత శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని, మీడియా ఏర్పాట్లను, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్‌ను సమాచార శాఖ పర్యవేక్షించాలని, సంబంధిత అధికారులు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పిడి పద్మనాభం, చిత్తూరు ఆర్డిఓ చిన్నయ్య, జిల్లా అధికారులు మురళి కృష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభా రాణి, డిఎస్ఓ శంకరన్, డిపిఓ లక్ష్మీ, డిఈఓ విజయేంద్ర రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, డిఐఓ డా.రవిరాజు, చిత్తూరు తహశీల్దారు మురళి మోహన్ పాల్గొన్నారు.

22న ఓటర్ల జాబితా విడుదల: డీఆర్‌వో

రాజకీయ పార్టీ నేతలతో మాట్లాడుతున్న డీఆర్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించి విచారణ పూర్తి చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 9 వరకు వచ్చిన క్లెయిమ్‌లను పూర్తిస్థాయిలో విచారించామన్నారు. నోటిఫికేషన్ వచ్చేంత వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందనన్నారు. కళాశాలలు ఇతర ప్రాధాన్యత గల ప్రదేశాల వద్ద ఈనెల 25న ఈవీఎంలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. నూతనంగా నమోదు అయిన ఓటర్లు ఒకే చోట 1400కు పైగా ఉంటే మరో పోలింగ్ కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రశ్నకు సమాధానంగా డిఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నుంచి భాస్కర్, పరదేశి, టీడీపీ నుంచి సురేంద్రకుమార్ వైసీపీ నుంచి ఉదయకుమార్, సూపరింటెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

చెన్నై టు మైసూర్ వయా చిత్తూరు

త్వరలో బుల్లెట్ ట్రైన్ ఆగమనం

ప్రత్యేక రైల్వేట్రాక్‌కు భూసేకరణ పనులు చేపట్టేలా ఎల్అండ్ టి యత్నం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఉమ్మడి చిత్తూరు జిల్లా రైల్వే పరంగా ఎంతో వెనకబడి ఉంది. జిల్లాల విభజన తరువాత ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ నేపథ్యంలో చిత్తూరు మీదుగా బుల్లెట్ ట్రైన్ రానుందనేది ఈ ప్రాంతవాసులకు శుభవార్తే. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గాంధీనగర్ నుంచి ముంబాయికి బుల్లెట్ ట్రైన్ పనులు జరుగుతున్నాయి. ఇది దేశంలో మొట్టమొదటి బుల్లెట్ ట్రైన్ అవుతుంది. అలాగే చెన్నై నుంచి మైసూర్‌కు బుల్లెట్ ట్రైన్ నడపాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చెన్నై నుంచి బెంగళూరు వయా మైసూరు వెళ్లాలంటే సుమారు పది గంటలు సమయం పడుతుంది. బుల్లెట్ ట్రైన్ పనులు పూర్తయితే చెన్నై నుంచి మైసూర్‌కు సుమారు రెండు నుంచి రెండున్నర గంట సమయం పడుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా మీదుగా ఈ బుల్లెట్ ట్రైన్ నడపడానికి రైల్వే ఉన్నతాధికారులు ప్రణాళికను రచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇటు కర్ణాటక అటు తమిళనాడు సరిహద్దు కావడంతో ఇటు వ్యాపారంగా అటు విద్య, వైద్య ఎంతోమంది చిత్తూరు జిల్లా వాసులకు బుల్లెట్ ట్రైన్ రావడంతో ఎంతో సమయం కలిసి రానుంది. చెన్నై హార్డ్‌వేర్ రంగంలో అభివద్ధి చెందగా, మైసూరు సాఫ్ట్‌వేర్ రంగంలో అభివద్ధి చెందింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఎంతోమంది విద్య వైద్య పరంగాప్రయాణం సాగిస్తూ ఉంటారు. సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఇబ్బందులు అన్ని ఎన్ని కావు. గత రైల్వే బడ్జెట్లో చెన్నై మైసూర్ మధ్య బుల్లెట్ ట్రైన్ నడపాలని కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదనలు తయారు చేశారు. అందుకు అనుగుణంగా ఈ పనులు సాగుతున్నాయి. బుల్లెట్ ట్రైన్ కు ప్రత్యేక రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయాలని అందుకు తగ్గట్టుగా ప్రణాళికను రచిస్తున్నారు. ఈ పనులు దక్కించుకోవడానికి ఎల్ అండ్ టి సంస్థ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. చెన్నై మైసూర్ మధ్య బుల్లెట్ ట్రైన్ పనులు ఐదేళ్ల లోపు పూర్తి చేయాలని కేంద్రం భావిస్తుంది. బుల్లెట్ ట్రైన్ చిత్తూరు మీదుగా వెళ్లడం వల్ల ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.మూడు రాష్ట్రాల మీదుగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకను కలుపుతూ 340 గ్రామాల మీదుగా బుల్లెట్ ట్రైన్ రాకపోకలు సాగించేలా అధికారులు డీపీఆర్ రూపొందించారు. సాధారణంగా చైన్నె నుంచి మైసూర్‌కు రైలులో వెళ్లాలంటే దాదాపు 10 గంటల సమయం పడుతుంది. అదే బుల్లెట్ ట్రైన్‌లో అయితే కేవలం 2 గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ ట్రైన్‌కు చిత్తూరులో స్టాపింగ్ ఇవ్వడంతో జిల్లావాసులకు సైతం సేవలందించనుంది.

చిత్తూరు స్టాపింగ్ మీదుగా...

జిల్లాలోని 41 గ్రామాల మీదుగా బుల్లెట్ ట్రైన్ ప్రయాణించనుంది. ఈ మేరకు 435 కిలోమీటర్ల వరకు 18 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ నిర్మించేందుకు డిజైన్ రూపొందించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ఇప్పటికే శాటిలైట్, ల్యాండ్ సర్వే పూర్తి చేసింది. 750 మంది ప్రయాణికులతో గంటకు 250 నుంచి 350 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ ట్రైన్ వెళ్లేందుకు వీలుగా ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లె వద్ద చిత్తూరు స్టాపింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

రైతులకు ఐదు రెట్లు పరిహారం

ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ అధికారులు భూసేకరణలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.. 41 గ్రామాలకు గాను 30 గ్రామాలకు చెందిన రైతులతో ఇప్పటికే సమావేశాలు పూర్తి చేశారు. వారి అభిప్రాయాలను పకడ్బందీగా సేకరిస్తున్నారు. భూములు ఇచ్చిన వారి కుటుంబంలో చదువుకున్న వారికి ఏదో ఒకవిధంగా ఉద్యోగావకాశం కల్పిస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు. దీనిపై పలువురు రైతులు సుముఖత వ్యక్తం చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. కేవలం రెండు గంటల్లోనే చైన్నె నుంచి మైసూర్‌కు వెళ్లిపోవచ్చు. మొత్తం ఫ్లైఓవర్ మీద వేసిన ట్రాక్‌పైనే రైలు వెళుతుంది. ఇందుకోసం భూసేకరణ చేపట్టాం. రైతులకు మార్కెట్ ధర కంటే ఐదు రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు.

మెరుగైన వైద్యం అందించాలి: డీఎంహెచ్‌వో

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదలకు మెరుగైన వైద్యం అందించి, మందులు పంపిణీ చేయాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో ప్రభావతి ఆదేశించారు. వివిద చోట్ల నిర్వహిస్తున్న క్యాంపులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. చిత్తూరు 13వ వార్డ్ మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మాపాక్షి హైస్కూల్ నందు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపును ఆకస్మిక తనిఖీ చేశారు. ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలియజేశారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, 7రకాల పరీక్షలు, 92 రకాల మందుల పంపిణీ, స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య సేవలు, కంటి వైద్య సేవలు తప్పక నిర్వహించి ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అత్యవసర కేసులను కార్పొరేట్ ఆసుపత్ర ులకు రిఫర్ చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఏప్రిల్ కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ నెల తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనుంది. ఏప్రిల్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్ లైన్ లక్కీడిప్ కోసం జనవరి 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు జనవరి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

తప్పుడు వార్తలు రాయొద్దు : మాజీ మంత్రి పరసారత్నం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తనను ఎల్లపుడూ వెన్నుతట్టి ప్రోత్సహించేది చంద్రబాబునాయుడని, పులివర్తి నానిని పరామర్శించిన తరువాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనను ఎవరూ నిల్చోమని చెప్పలేదని మాజీ మంత్రి పరసారత్నం స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ విలేకరుల సమావేశంలో తాను నిల్చుని ఉండటాన్ని కొన్ని పత్రికలు తప్పుడు వార్తలుగా చిత్రీకరించడాన్ని ఖండించారు. దళితుల పట్ల బాబుకు చిన్నచూపే ఉంటే, సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి తనకు ఆరుసార్లు ఎంఎల్ఏగా అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. అంతో ఇంతో దళితులకు మంచి జరిగిందంటే అది టిడిపి హయాంలోనేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగూరు కోదండ రామయ్య, రేవతి, సుబ్బయ్య పాల్గొన్నారు.

నదులను అనుసంధానం చేయాలి

సేలం వరకు సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇప్పటివరకు దేశంలోని పలు రాష్ట్రాలలో నదుల అనుసంధానానికై సైకిల్ యాత్ర చేపట్టిన తమిళనాడు వాసి తాజాగా చిత్తూరు నుంచి సేలంకు సైకిల్ యాత్ర బుధవారం ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా అమ్మయ్యరు కుప్పల గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు ఎస్.సంజీవ బుధవారం మధ్యాహ్నం చిత్తూరు నగరం నుంచి తమిళనాడు రాష్ట్రం సేలంకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో నదుల అనుసంధానం చేయాలని ఈ యాత్రను చేపట్టానని అన్నారు. ఇప్పటికే దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలు ఉత్తర భారత దేశంలోని పలు రాష్ట్రాలలో సైకిల్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేశారు. యాత్రలో భాగంగా అన్ని రాష్ట్రాలలో ఉన్న నదులను అనుసంధానం చేసి వివిధ రాష్ట్రాలలో ఉన్న సాగునీటి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. సాగునీటి సమస్యలు పరిష్కారం జరగాలంటే దేశంలో నదుల అనుసంధానం చేయడమే మార్గమని తాను భావిస్తున్నట్టు చెప్పాడు. అందుకే నదుల అనుసంధానం ప్రాధాన్యతను వివరిస్తూ ఈ యాత్రను చేపట్టినట్టు సంజీవి తెలిపారు. గతంలో కూడా రెండు పర్యాయాలు ఇదే రకంగా యాత్రను చేపట్టానన్నారు. ప్రస్తుతం చిత్తూరు నుంచి సేలంకు సైకిల్ యాత్ర చేయడంలో ప్రధానంగా ఈనెల 21వ తేదీన తమిళనాడు రాష్ట్రం సేలంలో డీఎంకే పార్టీ రాష్ట్ర సదస్సు జరగనుందని ఈ సదస్సుకు ముఖ్యమంత్రి స్టాలిన్ రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆ సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కలసి నదుల అనుసంధానం గురించి తన అనుభవాలను వివరించినట్లు సంజీవి తెలిపారు.

జగనన్న పాలనలో ప్రతిరోజు పండుగే: రోజా

ప్రజాశక్తి-నగరి: జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రతిరోజు పండుగే అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీకళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆమె ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీలకు భర్త ఆర్కే సెల్వమణితో కలిసి ఎద్దుల బండిపై ఆమె విచ్చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. పోటీల నిర్వహణలో భాగంగా మైదానంలో ఏర్పాటుచేసిన చిలకజోస్యం స్టాలు వద్ద ఆమె జోస్యం చెప్పించుకోవడం, ఎంపీపీకి మెహందీ పెట్టడం, కౌన్సిలర్లకు, మహిళలకు ఆమె స్వయంగా గాజులు తొడగటం అందరినీ అలరించింది. మైదానంలో సంప్రదాయం ప్రకారం పొంగళిపెట్టి డూడూ బసవన్నకు పూజలు చేశారు. సంక్రాంతి పిండి వంటలను తెలిపే ఐసీడీఎస్ బజార్‌లో మంత్రి, అతిథులు పిండివంటలను రుచిచూశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రతి ఇంటికీ ఏం చేస్తే సంతోషం ఉంటుందో వారి ఇళ్లవద్దకే వలంటీర్‌ను పంపి తెలుసుకొని ప్రతి సంక్షేమ పథకాన్ని వారి ఖాతాలకు వేసి వారిని ఆదుకుంటున్నారన్నారు. నేడు ఆనందంగా సంక్షేమ సంక్రాంతిని వారు నిర్వహించుకుంటున్నారన్నారు. నగరిలో కొండచుట్టు కార్యక్రమానికి చాలా విశిష్టత ఉందని అందుకే ఈ రోజున పోటీలు చేపట్టామన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రిగా సంప్రదాయాలు కాపాడలన్న తపన, అక్కచెల్లెల్లను సంతోషపెట్టాలన్న కోరికే పోటీల నిర్వహణకు దారితీసిందన్నారు. పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రెషర్‌కుక్కర్ పెట్టి పంపుతున్నానన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

ఎద్దుల బండి నడుపుతున్న మంత్రి రోజా

జల్లికట్టు.. గాయాల కట్టు

వెదురుకుప్పం మండలంలోని బ్రహ్మణపల్లిలో నిర్వహిబస్తున్న జల్లికట్టు

గుడిపల్లి: పరస్పర దాడిలో ఆసుపత్రిలో చేరిన గ్రామస్తులు

● బ్రహ్మణపల్లిలో పలువురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లిలో బుధవారం జల్లికట్టు జరిగింది. ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి కోడెగిత్తలతో పాటు వీక్షించడానికి జనం ఆ గ్రామానికి తరలివచ్చారు. జల్లికట్టు నిర్వహణకు గ్రామంలో అల్లీని ఏర్పాటు చేశారు. కోడిగిత్తల కొమ్ములను జువ్వి వాటికి రంగులు దిద్ది వాటి కొమ్ములకు చెక్కలతో తయారుచేసిన బహుమతులను కట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనం మిద్దెలు, గోడలు ఎక్కి జల్లికట్టును వీక్షించారు. వివిధ దేవుళ్ళు, రాజకీయ నాయకుల బొమ్మలు, కుటుంబీకుల ఫోటోలతో కూడిన ఆకృతుల్లో కట్టారు. అల్లీలో సిద్ధంగా ఉన్న యువకుల వైపు గిత్తలను తరిమారు. వీటిని నిలువరించేటందుకు యువకులు ప్రయత్నించారు. కొందరు గిత్తల కాళ్ళ కిందపడి గాయాలయ్యారు. పట్టీళ్ళ దక్కించుకునే క్రమంలో యువకుల మధ్య వాగ్వివాదం తోపులాట జరిగాయి. జల్లికట్టులో పలువురు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆ గ్రామస్తులు తెలిపారు.

జల్లికట్టులో టీడీపీ × వైసీపీ

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని కోటచంబగిరి గ్రామంలో బుధవారం జల్లికట్టు నిర్వహించారు. పార్టీలకతీతంగా జల్లికట్టు చేపట్టేందుకు గ్రామస్తులు సమాయత్తమయ్యారు. వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. బ్యానర్లను ఎందుకు ఏర్పాటు చేశారని పలువురు గ్రామస్తులు వైసీపీకి చెందిన వారిని అడిగారు. కాగా జల్లికట్టును మేమే నిర్వహిస్తున్నామని వైసీపీ నాయకులు చెప్పడంతో పరస్పర వాగ్వివాదం చోటుచేసుకుంది. పరస్పర వాదనలు ముదరడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. జల్లికట్టులో టీడీపీ వర్సెస్ వైసీపీగా మారింది. ఘటనలో పలువురు గాయపడి ఆసుపత్రి పాలైయ్యారు. అన్యాయంగా తమపై వైసీపీ నేతలు దాడి చేశారని నగేష్, అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

గుడిపల్లిలో నేడు ఎన్‌టీఆర్ వర్ధంతి

టి.ఎం.బాబు

ప్రజాశక్తి-గుడిపల్లి: ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని మండలం కేంద్రంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు టి.ఎం. బాబు నాయుడు తెలిపారు. గుడిపల్లి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో గురువారం ఉదయం 9గంటలకు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, ఎన్‌టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'పెంఛన్ దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రభుత్వ పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని బంగారుపాళ్యం ఉప ఖజానా అధికారి హరిచంద్ర ప్రసాద్ అన్నారు. బంగారుపాళ్యం ఉప ఖజానా పరిధిలోని ప్రభుత్వ పింఛన్‌దారులు ఫిబ్రవరి 28లోపు తమ లైఫ్ సర్టిఫికెట్ను సమర్పించాలన్నారు. అదేవిధంగా కార్యాలయ పని దినాలలో డిజిటల్ ఆన్లైన్ నమోదు చేసుకోవాలని లేనిపక్షంలో తదుపరి మాసం నుండి పింఛన్‌ను ప్రభుత్వం నిలిపేస్తుందన్నారు. అందుచేత ఈ అవకాశాన్ని ప్రతి ప్రభుత్వ పింఛన్ దారుడు గమనించి సహకరించాలని కోరారు.

వైసీపీ మండల యూత్ అధ్యక్షులుగా బాలాజీ

ప్రజాశక్తి-వికోట: వికోట మండల వైసీపీ యూత్ ప్రెసిడెంట్‌గా బాలాజీ ఎన్నికైనట్లు పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మండల పరిధిలోని గంధరమాకులపల్లికి చెందిన సియస్ బాలాజీ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన సేవలు గుర్తించి యూత్ అధ్యక్షులుగా నియమించడం జరిగిందన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుత్తూరు మండలం కొత్తతిమ్మాపురం గ్రామానికి చెందిన కే.నరసింహులురెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బుధవారం ఆలయంలో 3వందల మందికి అన్నదానం చేపట్టారు. వారిని టీటీడీ ఆలయ అధికారి అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పం పంచాయతీకి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆ పార్టీ నాయకులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణప్ప, పద్మమ్మ, సుబ్రి, టీవి రవి, విజయ్‌కుమార్ రెడ్డి, వెంకటాచలం, వెంకటరమణ, మంజునాథ్, సతీష్, శీన, నరసింహులు పాల్గొన్నారు.

బస్టాండు ఆవరణంలో పారిశుద్ధ్య పనులు

పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు, అన్న క్యాంటీన్, పార్క్ వద్ద అపరిశుభ్రంతో దుర్గంధం చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో వార్తా పత్రికల్లో వరుస కథనాలు వెలుబడడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి పారిశుద్ధ్యం పనులు చేపట్టారు.

రైతు కుటుంబాల పొంగళ్ళు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రంలో అమ్మవారి ఆలయాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా రైతు కుటుంబాల వారు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం కంబాల దేవులపల్లి గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారు, మండల కేంద్రంలో పెద్దపులి గంగమ్మ, సల్లాపురమ్మ, ఊరు గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా పొంగళ్లను మోసి ఆలయల వద్ద పొంగళ్ళు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రంగోలి పోటీలు

బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కుప్పం: మండలంలోని వెండుగాంపల్లి గ్రామంలో బుధవారం సంక్రాంతి వేడుకలను ద్వారకా టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కుప్పం మండల మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ విభాగం కమిటీ సభ్యులు, దళిత నాయకులు కన్నన్, రాజారాం, బాబులు పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ తెలుగువారి సాంప్రదాయాలను నేటి తరం చిన్నారులకు తెలియజేయడానికే ఇలాంటి వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళలకు రంగోలి పోటీలు, పురుషులకు తపస్సుమాను, కుండలు పగలగొట్టు పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి: ఎంపీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ అమరావతి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లతో మండల ఏవో శ్రీధర్ ఆధ్వర్యంలో సమావేశం జరిగినది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వాటిని ప్రణాళిక ప్రకారం నిధులు ఖర్చు చేయాలని గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ పంచాయతీ కార్యదర్శులు శంకర్, చెంగల్‌రాయలు, వాణి, సల్మా తదితరులు పాల్గొన్నారు.

కుప్పంకు కృష్ణాజలాలు రావడం హర్షనీయం: ఎమ్మెల్సీ భరత్

గంగా హారతి పడుతున్న ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు రావడం చాలా అభినందనీయమని ఎంపి రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వర్ది కుప్పం గ్రామం వద్ద కృష్ణా జలాలకు మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు కుప్పంకి హంద్రీనీవా జలాలు తీసుకొచ్చి మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు పుష్కలంగా నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పిటిసి నితిన్‌రెడ్డి, కన్వీనార్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఆరేళ్ళ జయప్ప, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి

నియామక పత్రాలు అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో జెనీస్, జుపోటో స్టోర్, డెక్కాయిటీన్ కంపెనీలతో ఉద్యోగమేళాను కళాశాల కరస్పాండెంట్ వెంకటాచలం ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా అధికారి గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక విజ్ఞాన్ డిగ్రీ ప్రైవేట్ కళాశాలలో మినీ జాబేళాకు నిరుద్యోగ యువతకు ఉద్యోగమేల నిర్వహించడం నిరుద్యోగులకు గొప్ప అవకాశం అన్నారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 3 బహుళ జాతీయ కంపెనీలలు జెనీస్, జుపోర్టర్, డెక్కీఎన్ సంస్థల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ జాబ్‌మేళాలో 83మంది హాజరైయ్యారు. వారిలో 32 మంది ఉద్యోగ అవకాశాలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. కార్యక్రమంలో చైతన్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు

బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీలో నిర్వహించిన ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్‌లో వీకోట మండలం హరి లెవెల్ మొదటి బహుమతి రూ.50వేల, ద్వితీయ బహుమతి పంద్యాలమడుగు టైగర్స్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, వెంకటాచలం, సుబ్రి, కృష్ణనాయక్, నందారెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

శ్రీసత్తెమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

రామచంద్రపురం: సంక్రాంతి పండుగలో చివరి రోజు ముక్కనుమ సందర్భంగా మండలంలోని అనుపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీసత్తెమ్మ దేవతకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయాన్ని పచ్చని తోరణాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, పసుపు కుంకుమ, బంగారు ఆభరణాలు పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గ్రామస్తులందరూ అమ్మవారికి పొంగళ్ళు పెట్టి, డప్పులు వాయిస్తూ బాణా సంచాలు పేల్చుతూ, భక్తులు తడి బట్టలతో, పొలి దండాలు పెడుతూ అమ్మవారి దేవాలయం వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఓం శక్తి నామస్మరణ నడుమ అమ్మవారి ఆలయం మారు మ్రోగింది. అమ్మవారికి భక్తులు ధూప దీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బొడ్డు మునిరాజ, అనిత దంపతుల కుమార్తె యత్వికను తులాభారం వేశారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపిరెడ్డి కృష్ణారెడ్డి, ఆకా దామోదరం, వలిగరం గోపి, ఆకా నవీన్, గురు తేజస్వి, ప్రవీణ కుమారి, దేవరాజులు, లోశెట్టి మురళి, బొడ్డు తుకారాం, రాంపురి అల్లేయ్య మహిళలు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

ఏనుగులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గట్టువారిపల్లి గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జంట ఏనుగులు పంట పొలాలపై దాడి చేసి తీవ్ర నష్టాన్ని కలిగించినట్టు రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన సోమశేఖర్, గంగయ్య, సీతారామయ్య, నాగరాజా రైతులకు చెందిన పంటలపై దాడి చేసి ధ్వంసం చేసినట్లు తెలిపారు. చెరకు మామిడి టమోటా అరటి పంటలపై దాడి చేసినట్టు గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు గుర్తించారు. ప్రభుత్వం ఏనుగుల బారి నుండి రైతులను రక్షించాలని పంట నష్టం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీ పాలనలోనే బీసీల అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీ కులాల ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందారని ఆ పార్టీ బిసి రాష్ట్ర సభ్యుడు నారాయణ చారి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీసీలకు బ్యాంకు రుణాలు, చేనేత కార్మికులకు పనిముట్లు, కుట్టుమిషన్లు, దోబీ మిషన్లు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఇప్పటి ప్రభుత్వంలో బీసీలపై అక్రమ కేసులతోపాటు, భూకబ్జాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. బిసిలకు పూర్వవైభవం రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. నియోజకవర్గంలో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, నరసింహులు, రామ్మూర్తి, సుబ్రీ, మనోహర్, రామలింగారెడ్డి, వెంకటాచలం, వెంకటరమణ తదతరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు ఓటర్ ఫైనల్ జాబితా అందజేయాలి: జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అబ్జర్వర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాజకీయ పార్టీలకు ఫైనల్ ఓటర్ జాబితా హార్డ్ కాపీని అందజేయాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం నందు ప్రత్యేక ఓటర్ల సవరణ-2024పై జిల్లా ఎన్నికల అధికారిచ, కలెక్టర్ ఎస్. షణ్మోహన్, జెసి పి.శ్రీనివాసులుతో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నియోజకవర్గ కేంద్రాల తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు ఫైనల్ ఓటర్ జాబితా హార్డ్ కాపీని అందజేయాలన్నారు.

మూలస్థాన ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

పట్టు వస్త్రాలుతీసుకెలుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): సంక్రాంతి సందర్భంగా చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ కొండచుట్టు ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి పలువురు పట్టు వస్త్రాలు సమర్పించారు. బుధవారం స్థానిక శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి , టిడిపి నాయకురాలు సుధా రెడ్డి , టిడిపి నాయకులు మూలస్థాన ఎల్లమ్మకు పట్టు వస్త్రాలను కోదండరామ స్వామి ఆలయం నుండి మంగళ వాయిద్యాలు ఓం శక్తి నామస్మరణల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందిం చారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ దుష్ట శక్తుల నుండి చంద్రగి రిని కాపాడాలని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. సుధా రెడ్డితోపాటు టిడిపి నాయ కులు గౌస్ బాషా, అమ్ములు, నాగరాజు రాయల్, నాయకులు, మహిళలు, కార్యకర్తలు. ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు ఈవో తిమ్మారెడ్డి, చైర్మన్ యరాశి చంద్రశేఖర్ రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..

- మిమ్మల్ని గెలిపించు కుంటాం..
- టిడిపి నాయకులకు మహిళల అభ్యర్థన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వైసీపీ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే వున్నాయని, టిడిపి హయాంలో వేసిన రోడ్లు, ఎల్ఈడి దీపాలు తప్ప వాటి మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడిం దని, వాటిని పరిష్కరిస్తే మిమ్మల్ని గెలిపించు కుంటామని మహిళలు టిడిపి నాయకులను కోరారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ లో భాగంగా పలు వార్డుల్లో టిడిపినాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం గా పలువురు మహిళలు టిడిపి నాయ కులకు ఘన స్వాగతం పలికారు. తాము తమ ఊర్లలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వాటిని పరిష్క రిస్తే తప్పక గెలిపించు కుంటామన్నారు. స్పందించిన గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ తాము అధికారంలో కొస్తే సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పట్టణ టిడిపి ప్రసిడెంటు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ ప్రసిడెంట్ షణ్ముగరెడ్డి, మణి రెడ్డి , సంతోష్, అర్జున్ రెడ్డి, చొక్కాలింగ రెడ్డి,చిరంజీవి, వెంకటముని, ఆర్ముగాం రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, 5 వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'లో యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

ప్రజాశక్తి -రేణిగుంట : బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో సాఫ్ట్‌వేరు ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న యువ ఇంజనీర్లు సంక్రాంతి సెలవులు సందర్భంగా తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. రేణిగుంట మండలం ఆర్ మల్లవరం పంచాయతీ గ్రామానికి చెందిన యువ సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగను తమ సొంత గ్రామంలో కుటుంబ సభ్యులతో ఆనం దంగా పండుగ సంబరాలను జరుపు కోవాలని గ్రామానికి చేరుకున్నారు. కానీ ఆర్ మల్లవరం నుంచి ఎస్వీపురం వరకు రెండు కిలోమీటర్లు రోడ్డుకి ఇరు వైపులా పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మందు బాటిళ్లు దర్శనమిచ్చాయి. ఇవి చూసిన యువ సాఫ్ట్వేర్ ఇంజనీర్లు నడుం బిగించారు. గ్రామాల్లో వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించి సుమారు రెండు కిలోమీటర్లు ఆర్ మల్లవరం నుంచి ఎస్వీపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యువ ఇంజనీర్లు జగన్మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జయ కుమార్ రెడ్డి, కోహిత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం కృషి చేసిన యువకులను గ్రామ పెద్దలు సుబ్రమణ్యం రెడ్డి, మహదేవరెడ్డి అభినందించారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-తడ: తడ మండలం లోని కారూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. ఈ పోటీలలో 150 మంది పాల్గొనగా అందులో ఐదుగురు గెలుపొందారు. వారికి బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఎయిర్ కూలర్, రెండవ బహుమతి మిక్సీ, మూడవ బహుమతి మంచం, నాల్గవ బహుమతి చిన్న ఫ్యాన్, ఐదవ బహుమతి కుక్కర్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జేసీ యస్ కన్వీనర్ సుందర్ రెడ్డి, మండల యువజన నాయకులు తిరుమల రెడ్డి, నాయకులు మునస్వామి రెడ్డి, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం.. అన్నదానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎన్టిఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం 10గంటలకు స్థానిక కార్వేటినగరం కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తారని ఉదయం 11గంటలకు కెనరా బ్యాంకు ఎదురుగా ఉచిత మెగా వైద్య శిబిరం, అన్నదానం నిర్వహిస్తున్నామని చిత్తూరు పార్లమెంటరీ టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కుటుంబ సభ్యులు, ఎన్టిఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు, అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు జి.జీవరత్నం నాయుడు, ప్రధానకార్యదర్శి ఎన్ఎన్‌ధనపాల్ కోరారు. ఈ సమావేశంలో పుత్తూరు మున్సిపల్ మాజీ చైర్మన్ బిఆర్‌యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ ఏ ఆనంద్, 22వ వార్డు అధ్యక్షుడు కన్నన్ పాల్గొన్నారు.